క్లుప్తంగా

సీహెచ్‌సీకి చేరిన మందులు


సీహెచ్‌సీకి చేరిన మందులు

సీతంపేట: స్థానిక సీహెచ్‌సీకి అవసరమైనన్నీ మందులు శనివారం వచ్చి, చేరాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున వాటికి సంబంధించిన మందులను ముందుగానే ఆస్పత్రులకు ప్రభుత్వం చేరవేస్తోంది. ప్రస్తుతం పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు చేరిన మందులను స్టోర్ రూమ్‌లో సిబ్బంది భద్రపరుస్తున్నారు. జ్వరాల బారినపడిన జనానికి తక్షణమే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

● జూనియర్ సివిల్ జడ్జి విజయ్ రాజ్‌కుమార్


ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్ రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్ రాజ్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన సందర్శించి, అక్కడి మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం అక్కడి ఖైదీలతో మాట్లాడి, వారికి ఏవైనా సమస్యలుంటే అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందుబాటులో ఉండే న్యాయసేవలపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడుచే అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యం బాగుండేలా చూడాలని, క్రమం తప్పకుండా వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ జోగులు, జైలు లీగల్ విజిటర్ ఎం.వెంకటేశ్వరరావు, న్యాయవాది ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అనీల్‌కుమార్

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో ఏవైనా అవకతవకలు చోటుచేసుకున్నాయా లేదా అనే విషయం తేల్చేందుకు చేపడుతున్న సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీలు)కు ప్రతిఒక్కరూ సహకరించాలని వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ కోరారు. ఇదే విషయమై మండలంలోని గోపాలపురం గ్రామంలో సర్పంచ్ ఎస్.జగదీశ్వరరావు నేతృత్వంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సంవత్సర కాలంలో జరిగిన పనుల్లో పనుల తీరు, గుర్తించిన లోపాలను సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ గోవిందరావు గ్రామస్తులకు చదివి, వినిపించారు. పక్కాగా సోషల్ ఆడిట్ జరుగుతోందని, దీనికి గ్రామస్తుల సహకారం కూడా కావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ రామారావు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతల సమావేశం నేడు

గరుగుబిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కురుపాం పర్యటన నేపథ్యంలో జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి కోటలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో పార్టీ నేతలు సమావేశం కానున్నారు. ఈ నెల 28వ తేదీన సీఎం వస్తున్న కారణంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నామని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను భక్తులు శనివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. నిత్యపూజలు, పల్లకీ సేవ తర్వాత సర్వదర్శనం సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని విక్రమపురం గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోని మరే రాష్ట్రంలో అమలు కానన్నీ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. అన్ని వర్గాల వారు అన్ని విధాలా బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందరికీ మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. మరోవైపు అభివృద్ధి కూడా శరవేగంగా జరుగుతోందన్నారు. పోర్టులు, విమానాశ్రయాల నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని జనం నమ్మడం లేదన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల మహేష్, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి మృతి


మృతి చెందిన గర్భిణి గొర్లి సునీత

కురుపాం: ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణి గొర్లి సునీత(25) మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మంతినివలస గ్రామానికి చెందిన గర్భిణి సునీత అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం కురుపాం సీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు కూడా విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని సూచించగా, తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు


వీరఘట్టం: పూజలందుకున్న బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

వీరఘట్టం: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా హిరాపంచమి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగరాజ్ రథో ఆధ్వర్యంలో బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆకుకూరలు, పప్పుదినుసులు, కట్టెలు, విస్తరాకులను స్వామి వారికి సమర్పించారు. గుండిచామందిరం ప్రాంగణమంతా భక్తుల జై జగన్నాథనామస్మరణతో మార్మోగింది. లోక కల్యాణం కోసం స్వామి వారు ఇంటి నుంచి వచ్చి గుండిచామందిరంలో కొలువుదీరారని, ఒంటరి వాడైన స్వామికి భోజనం వండుకునేందుకు భక్తులు పప్పుదినుసులు, ఆకుకూరలు, కట్టెలు ఇచ్చారని యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ భక్తులకు తెలిపారు.

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం హిరాపంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారు రథయాత్ర(గుండిచామందిరం నుంచి రథంపై ప్రధాన ఆలయానికి జగన్నాథుని పయనం) చేపట్టారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు


ఎంపికలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: డా.వైఎస్సార్ క్రీడా పాఠశాల, కడపలో 2022 – 23 సంవత్సారానికి 4, 5 తరగతుల్లో ప్రవేశానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎంపికలు నిర్వహించామని జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు అన్నారు. పార్వతీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలలో జిల్లా నలుమూలల నుండి 10 (బాలురు 5 + బాలికలు 5) మంది హాజరయ్యారు. ఎంపిక కార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి, ముఖ్య క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఎంపికలలో ప్రతిభ సాధించిన క్రీడాకారులను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న పోటీలకు పంపనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాలకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచినట్టు పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో నాలుగు కోర్సుల్లో మొత్తం 230 సీట్లు భర్తీ చేయనున్నామన్నారు.

నేడు యోగాపై అవగాహన

పాలకొండ రూరల్: స్థానిక రుషి యోగా కేంద్రంలో ప్రత్యేక మోటివేషనల్ క్యాంప్ నిర్వహించి, యోగా, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నామని యోగా శిక్షకులు కె.జనార్దనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ఆచార్య సుధీర్, కొత్తూరుకు చెందిన ఆచార్య రాజ్ కలిసి ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఔత్సాహికులంతా హాజరు కావాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నూతన కోర్సులు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుండి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎమ్మెస్సీ కంప్యూటర్స్ ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీలో పొలిటికల్ సైన్స్ (మేజర్ హానర్స్), ఎకనమిక్స్ (మేజర్), బీకాం జనరల్(మేజర్), కంప్యూటర్ అప్లికేషన్ (మైనర్), బీఎస్సీ కెమిస్ట్రీ (మేజర్), ఫిజిక్స్(మైనర్), జువాలజీ (మేజర్), బోటని (మైనర్), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ (మేజర్), మేథమెటిక్స్ (మైనర్) ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలు కోరే విద్యార్థులు ఈ నెల 26 నుండి 30 వరకు తమ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సీజ్ చేసిన వాహనాల వేలం రేపు

సాలూరు: పట్టణంలో పలు సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, వివిధ కేసుల్లో పట్టుకున్న టాటా ఏస్-1, టాటా మేజిక్ -1, కార్లు - 2, ఆటోలు - 2, టూ వీలర్స్ - 11 మొత్తం 17 వాహనాలకు వేలం వేయనున్నామని పేర్కొన్నారు. పట్టణ స్టేషన్లో నిర్వహించే ఈ వేలం పాటలో ఔత్సాహికులు పాల్గొనాలని సూచించారు.

పక్కాగా 'జగనన్న సురక్ష'

● జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు


పాలకొండ రూరల్: బద్దుమాసింగిలో ప్రజాసమస్యలను నమోదు చేయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


గరుగుబిల్లి: రావివలసలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు


భామిని: బత్తిలిలో జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు


గుమ్మలక్ష్మీపురంలో పర్యటిస్తున్న ఎంపీడీఓ సాల్మన్ రాజు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

గరుగుబిల్లి: ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంగా జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు సూచించారు. మండలంలోని రావివలస గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ట్రయల్ రన్‌ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల అర్హులను, ప్రజాసమస్యలను గుర్తించి, నమోదు చేయాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందేలా, జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, సీసీఆర్‌సీ, రేషన్‌కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ వంటి 11 రకాల ధ్రువపత్రాలు కావాల్సిన వారికి సకాలంలో వాటిని ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా అందించేందుకు ఈ జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్స అప్పడు, తహసీల్దార్ జనార్దన్, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, డీటీ పీఎస్ఎల్ కుమార్, కార్యదర్శి ఆర్.శశికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.గౌరునాయుడు, బి.సురేష్, సీహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జంపరకోట పంచాయతీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి, ప్రజాసమస్యలు నమోదు చేశారు. అర్హులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని, అందరికీ ప్రభుత్వ సేవలు, పథకాలు అందాలన్నదే సీఎం జగన్ ముఖ్య ఉద్దేశ్యమని సర్పంచ్ వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ, జి.రామచంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ ఉమామహేశ్వరి, వీఆర్‌ఓ ఎస్.జంగాలు, పంచాయతీ కార్యదర్శి భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ గుండేలా చంద్రరావుల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా విడిపోయిన వలంటీర్లు, ఉద్యోగులు బత్తిలి, భామిని ప్రాంతాల్లో పర్యటించి, అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలతో పాటు జనన, మరణ, కుల, ఆదాయ వంటి ధ్రువపత్రాలు కావాల్సిన వారి వివరాలు సేకరించి, నమోదు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గుర్ల కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో జగనన్న సురక్షా శిబిరాలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి పథకాలు రాని వారి వివరాలు సేకరించారు. అలాగే జనన, మరణ, కుల, ఆదాయ వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలు కూడా సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఈఓపీఆర్డీ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరాహ, నరసింహావతారంలో

జగన్నాథుని దర్శనం


రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా వరాహ నరసింహస్వామి అవతారంలో జగన్నాథస్వామి భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. హీరాపంచమి సందర్భంగా ఈ ప్రత్యేకాలంకరణలో కనిపించిన దేవతామూర్తిని చూసేందుకు జనం బారులుతీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు నడుమ సాయంత్రం మారు రథయాత్ర చేపట్టారు.

-పాలకొండ

పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు


నీలకంఠాపురం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ నోడల్ అధికారి వినోద్‌కుమార్

కురుపాం: మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ నోడల్ అధికారి మంతిన వినోద్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరాతీశారు. అలాగే నీలకంఠాపురంలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయోనని వైద్యాధికారులు అభినవ్‌కుమార్, అమర సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూముల రీసర్వే


భూముల సర్వేలో అధికారులు

పాలకొండ రూరల్: రైతుల సమక్షంలో భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. స్థానిక పట్టణ పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వేను శనివారం పరిశీలించిన ఆయన భూ యజమానులు కూడా సర్వే జరుగుతున్న ప్రదేశానికి వచ్చేటప్పుడు భూములకు సంబంధించిన అన్ని వివరాలు తెలిపే పత్రాలను తీసుకురావాలన్నారు. సర్వేలో ఏవైనా తేడాలు వస్తే వాటిని వెంటనే పరిష్కరించుకోవచ్చన్నారు. రైతుల మధ్య ఎన్నో ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు సాయిశ్రీనివాస్, రామారావు, సర్వేయర్లు గణేష్, మణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అమ్మనరావు

భామిని: మండలంలోని చిన్నదిమిలి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. కొత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలని, 6 నుంచి 14 ఏళ్ల మధ్య పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనందించాల్సి ఉంటుందన్నారు. బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు తెలిపారు. అనంతరం పోక్సో చట్టంలోని అంశాలు వివరించి, బాలలపై లైంగికదాడులకు పాల్పడితే కఠిన శిక్ష పడుతుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉన్న సమయంలో దిశ యాప్‌ను ఆశ్రయించి, రక్షణ పొందవచ్చని తెలిపారు. చైల్డ్ మ్యారేజ్ యాక్ట్‌పై న్యాయవాదులు చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజు, ధర్మారావు, కృష్ణారావు, సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు


బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారుడిని పరీక్షిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రాజాం, సీతంపేట, వీరఘట్టం వెళ్లే రోడ్లలో శనివారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వాహనాలతో తిరుగుతున్న వారికి అపరాద రుసుం విధించారు. అలాగే అధికలోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న ఆటోడ్రైవర్లపై పలు కేసులు నమోదు చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.